నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I హైదరాబాద్, గురువారం 18 జూలై 2024 RANGAREDDY

కడ్తాల్ మండల కేంద్రంలో కేజీబీవీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, వీర్లపల్లి శంకర్

పారిశ్రామిక రంగ అభివృద్ధికి పెద్దపీట

-ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి కడ్తాల్‌లో కేజీబీవీ భవన ప్రారంభం

కడ్తాల్, జూలై 17 : రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని మరింత అభివృద్ధి చేసి, యువతకి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మండల కేంద్రం సమీపంలో సమగ్ర శిక్ష నిధులు రూ.3.35 కోట్లతో నిర్మించిన కస్తూర్బాగాంధీ విద్యాలయ నూతన భవనాన్ని బుధవారం రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, కలెక్టర్ శాంక, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, పీసీబీ సభ్యుడు బాలాజీసింగ్, డీఈవో సుశీందర్‌రావు, ఏంఈవో సర్దార్‌నాయక్‌తో కలిసి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో హైదరాబాద్ నగరంలో స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం చెర్కూర్ గ్రామం వద్ద వంద ఎకరాల్లో త్వరలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలను, వంగూర్ మండలం సర్వారెడ్డిపల్లి గ్రామంలో వెయ్యి ఎకరాల్లో రూ.800 కోట్లతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. వనపర్తి జిల్లాలో ఐటీ టవర్స్‌తోపాటు హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారిపై ఇండస్ట్రియల్ కారిడార్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో ఓఎల్‌ఈడీ పరిశ్రమ ఏర్పాటును పరిశీలిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తున్నదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గురువారం నుంచి రైతుల ఖాతాల్లో రుణమాఫీకి సంబంధించిన డబ్బులను జమ చేయడం జరుగుతుందని చెప్పారు. అనంతరం మండల కేంద్రంలో ప్రభుత్వ దవాఖాన, జూనియర్ కళాశాల, బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరుతూ, మంత్రులకు పలువురు నాయకులు వినతిపత్రాలను అందజేశారు. అంతకుముందు వన మహోత్సవ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ఆవరణలో మంత్రులు, ఎమ్మెల్యేలు అటవీ శాఖ అధికారులతో కలిసి మొక్కలను నాటారు.

చెంచులకు బోరుమోటర్లు పంపిణీ..

మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామ పంచాయతీలో గల జమ్ములబావి తండాలోని 26 చెంచు కుటుంబాలకు, బుధవారం రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి బోరుమోటర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్ గుప్తా, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి భీక్యా నాయక్, బ్లాక్ కాంగ్రెస్, మండల పార్టీ అధ్యక్షులు నర్సింహా, బీచ్యానాయక్, నాయకులు భాస్కర్‌రెడ్డి, మోత్యానాయక్, హన్మానాయక్, చందోజీ, వేణుగోపాల్, జహంగీర్‌అలీ, యాదగిరిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నరేశ్‌నాయక్, శంకర్, శేఖర్‌గౌడ్, రాములుగౌడ్, రాజేశ్, బాలరాజు, మల్లేశ్‌గౌడ్, శేఖర్, యాదయ్య, రాజేందర్‌గౌడ్, భానుకిరణ్, ఏసీపీ రంగస్వామి, డీఎఫ్‌వో సుధాకర్‌రెడ్డి, ఆర్డీవో సూరజ్‌కుమార్, డీటీడీవో రామేశ్వరీదేవి, ఏటీడీవో వెంకటయ్య, సీఐ శివప్రసాద్, తహసీల్దార్ ముంతాజ్, ఎంపీడీవో సుజాత, ఏంఎన్‌వో జంగయ్య, ఎస్‌ఓ అనిత పాల్గొన్నారు.

రుణమాఫీపై గందరగోళం..

వికారాబాద్, జూలై 17 (నమస్తే తెలంగాణ) : ఆగస్టు 15లోపు రూ.2 లక్షల పంట రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించిన రేవంత్ ప్రభుత్వం.. రుణమాఫీ అమలుకు షరతులు విధించడంపై రైతుల్లో వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెండు దఫాల్లో రూ.లక్షలోపు రుణమాఫీ ప్రక్రియను ఎలాంటి షరతులు లేకుండా అమలు చేసింది. అన్ని వర్గాల ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు మల్లగుల్లాలు పడుతున్నది. ఇప్పటికే వానకాలం సగం అయిపోవస్తున్నా రైతుభరోసాపై స్పష్టత లేదని రైతులు విమర్శిస్తున్నారు. పెట్టుబడి సాయం అందక పోవడంతో విత్తనాలు, ఎరువుల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించిన పరిస్థితి వచ్చింది. రైతు భరోసాపైనే క్లారిటీలేని కాంగ్రెస్ ప్రభుత్వానికి రుణమాఫీపై రోజుకోమాట మాట్లాడుతూ అన్నదాతలను అయోమయానికి గురి చేస్తున్నది. రుణమాఫీ అమలుకుగాను రేషన్ కార్డు తప్పనిసరిగా ప్రామాణికమని ప్రకటించిన ప్రభుత్వం, సర్వత్రా వ్యతిరేకత రావడంతో వెనక్కి తీసుకొని కేవలం కుటుంబ సభ్యుల గుర్తింపునకు మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని మరో ప్రకటన జారీ చేసి, పట్టాదారు పాసుపుస్తకాన్ని ప్రామాణికంగా తీసుకుంటామని ప్రభుత్వం వెల్లడించింది. పీఏం కిసాన్‌ను ప్రామాణికంగా తీసుకుంటామని కూడా ప్రభుత్వం ప్రకటించడంపై జిల్లా రైతాంగం నుంచి తీవ్ర అభ్యంతరం వ్యక్తమవుతున్నది. మరోవైపు ఆగస్టు 15లోపు రూ.2 లక్షల పంట రుణాలను మాఫీ చేస్తామని హామీనిచ్చి ఇప్పుడు కేవలం రూ.లక్షలోపు పంట రుణాల మాఫీ ప్రక్రియ నేటి నుంచి ప్రారంభించేందుకు నిర్ణయించారు. రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వ హామీకి నెలరోజులు కూడా లేకపోవడం, ప్రస్తుతం కేవలం రూ.లక్షలోపు రుణాలను మాఫీ చేసేందుకు నిర్ణయించడంపై ఇంతటితో చేతులెత్తేస్తారేమోనన్న అయోమయం రైతుల్లో నెలకొన్నది.

రూ.లక్షలోపు రుణాలు తీసుకున్న రైతులు 46,633..

పంటల సాగు కోసం బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణాలకు సంబంధించి రూ.2 లక్షల్లోపు పంట రుణాలను మాఫీ చేస్తామని గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీనిచ్చింది. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 13 వరకు తీసుకున్న రుణాలకు మాత్రమే రుణమాఫీ వర్తిస్తుందని ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. మొదట రుణమాఫీ అమలుకుగాను రేషన్ కార్డు ప్రామాణికంగా అర్హుల గుర్తింపు ప్రక్రియ చేపడుతామని పేర్కొన్నది, తదనంతరం తీవ్ర అభ్యంతరం వ్యక్తం కావడంతో రేషన్ కార్డు కాకుండా పట్టాదారు పాసుపుస్తకమే ప్రామాణికమని వెల్లడించింది. రేషన్ కార్డు కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసమే పరిగణనలోకి తీసుకుంటామని ప్రకటించింది. రేషన్ కార్డు ఆధారంగా కుటుంబ సభ్యులను గుర్తించి రుణమాఫీ అమలు చేసినట్లయితే ఇప్పటికే వేరుగా ఉంటున్న అన్నదమ్ములను ఒకే కుటుంబ పరిధిలోకి తీసుకొని ఇద్దరు తీసుకున్న రుణాలను కలిపి కుటుంబం యూనిట్‌గా రుణాలను మాఫీ చేయనున్నారు. దీంతో చాలా మంది రైతులకు అన్యాయం జరుగనున్నది. పట్టాదారు పాసు పుస్తకాలు వేరుగా అయినప్పటికీ రేషన్ కార్డులు మాత్రం కొత్తగా మంజూరు చేయకపోవడంతో ఒకే రేషన్ కార్డుతో ఉమ్మడి కుటుంబం కొనసాగుతూ వస్తున్నది. అయినప్పటికీ భూములు భాగాలుగా చేసుకోవడంతో వేర్వేరుగా రుణాలు కూడా బ్యాంకుల నుంచి పొందారు. ఇప్పుడు కుటుంబ సభ్యులను రేషన్‌కార్డు ఆధారంగా పరిగణనలోకి తీసుకుంటామని ప్రభుత్వం పేర్కొనడంపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రేషన్‌కార్డును పరిగణనలోకి తీసుకునే ఆలోచన ఉన్నప్పుడు ముందు రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ వ్యక్తమవుతున్నది. ప్రభుత్వ నిర్ణయంతో కేవలం కొంత మంది రైతులకు మాత్రమే లబ్ధి చేకూరనున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.లక్షలోపు రుణాల మాఫీతో రూ.1.20 లక్షల మంది రైతులు లబ్ధి పొందగా, కాంగ్రెస్ ప్రభుత్వం పెడుతున్న కొర్రీలతో సగం మంది రైతులకు కూడా లబ్ధి చేకూరే పరిస్థితి లేకపోవడం గమనార్హం. మరోవైపు ప్రస్తుతం కేవలం రూ.లక్షలోపు పంట రుణాలను మాత్రమే మాఫీ చేసేందుకు నిర్ణయించి, గురువారం నుంచి రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు నిర్ణయించింది. జిల్లాలో రూ.లక్షలోపు పంట రుణాలు తీసుకున్న రైతులు 46,633 మంది ఉన్నారు.

మొదట రేషన్‌కార్డు అనడంతో తీవ్ర వ్యతిరేకత.. ఇప్పుడు పట్టాదారు పాసు పుస్తకం ప్రామాణికమంటూ..

రుణమాఫీ షరతులపై ప్రభుత్వంపై వ్యతిరేకత

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.లక్షలోపు పంట రుణాలున్న అర్హులందరికీ వర్తింపు

రుణమాఫీ అవుతుందో లేదోనని జిల్లా రైతుల్లో ఆందోళన

జిల్లాలో రూ.లక్షలోపు రుణాలు తీసుకున్న రైతులు 46,633

కొర్రీలు పెట్టడం సరికాదు..

రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా రుణమాఫీ చేయాలి. పట్టాపాసు బుక్కు ఆధారంగా రుణాలను మాఫీ చేయాలి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. రుణ మాఫీ కోసం రైతులు వేయి కండ్లతో ఎదురు చూస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన రాక రైతులు అయోమయానికి గురవుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రుణమాఫీ చెప్పింది. ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోగా, ఇప్పుడు రుణమాఫీలో కొర్రీలు పెడుతున్నది. కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ప్రతి రైతు రుణాన్ని మాఫీ చేయాలి.

– రమేశ్ గౌడ్, కోట్‌మర్పల్లి, మర్పల్లి మండలం

నిబంధనలు పెట్టడం సరికాదు..

రూ.2 లక్షల్లోపు రుణాలు తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక నిబంధనలు పెట్టడం సమంజసం కాదు. ఇచ్చిన మాట ప్రకారం రూ.2 లక్షల్లోపు రుణాలను ఒకేసారి మాఫీ చేయాలి.

– వడ్డె వెంకట్రాములు, మోత్కూర్ గ్రామం, దోమ మండలం

నిబంధనలు లేకుండా రుణ మాఫీ చేయాలి..

ఎన్నికల్లో ప్రకటించిన విధంగా ఎలాంటి నిబంధనలు లేకుండా రుణాలను మాఫీ చేయాలి. రుణ మాఫీ విషయంలో కొర్రీలు పెట్టడం సరికాదు. ఎప్పుడో ఇచ్చిన రేషన్ కార్డుల ఆధారంగా రుణాలు మాఫీ చేస్తానన్నడం ఏమిటి.. ఇది రైతులను మోసం చేసేందుకు పన్నుతున్న కుట్ర.

–ఎండీ మహబూబ్, రాంపూర్ గ్రామం, కోట్‌పల్లి మండలం

రైతులందరికీ న్యాయం చేయాలి..

రుణాలు తీసుకున్న రైతులందరికీ న్యాయం చేయాలి. రేషన్‌కార్డు ఉన్నవారికే అనడం సరికాదు. ఎక్కువ భూమి ఉన్న రైతులకు రేషన్‌కార్డులు ఉండవు. రేషన్ కార్డులు ఎప్పుడో ఇచ్చారు.. మళ్లీ కొత్తవి రాలేదు. రేషన్ కార్డులో ఉన్నవారు ఒకే కుటుంబంలో లేరు. పెండ్లిళ్లు అయ్యి వేరుగా ఉంటున్నారు. రైతులను మోసం చేయాలని చూస్తే గుణపాఠం తప్పదు. ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలు గందరగోళంగా ఉన్నాయి.

– పి.నర్సింహారెడ్డి, మోమిన్‌ఖుర్ద గ్రామం, ధారూరు మండలం

నిర్బంధకాండ..

మంత్రులు వస్తున్నారని బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్

భగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు

పోలీసుల తీరును నిరసిస్తూ... కడ్తాల్, తలకొండపల్లి మండల కేంద్రాల్లో ధర్నా

కడ్తాల్, జూలై 17: కాంగ్రెస్ మార్క్ పాలన కళ్ల ముందు కనిపిస్తున్నది. పోలీసుల చేత ప్రతి పక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలను నిర్బంధించడం, అరెస్ట్ చేయడం నిత్యకృత్యంగా మారింది, మంత్రుల పర్యటనను అడ్డుకుంటారనే కుంటి సాకుతో బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేయడంపై కల్వకుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ భగ్గుమన్నది. కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఖండించాలని బీఆర్ఎస్ నాయకులు ప్రజాస్వామిక వాదులకు పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్..

మండల కేంద్రంలో బుధవారం తెల్లవారుజామున మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ ప్రజాప్రతినిధులు గోపాల్, హరిచంద్‌నాయక్, మహేశ్, నాయకులు పాండునాయక్, అంజితోపాటు పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిని నేరుగా తలకొండపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మండల కేంద్రం సమీపంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కస్తూర్బా పాఠశాలను ప్రారంభించేందుకు ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖల మంత్రి శ్రీధర్‌బాబు, ఎక్సైజ్, టూరిజం శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు వస్తున్న నేపథ్యంలో కార్యక్రమాన్ని అడ్డుకుంటారనే అనుమానంతో బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన నేతలు భగ్గుమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగట్టారు.

కడ్తాల్, తలకొండపల్లి మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ నాయకుల ధర్నా..

కడ్తాల్ మండలంలో బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్‌ను నిరసిస్తూ కడ్తాల్, తలకొండపల్లి మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ధర్నాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులంటే మంత్రులకు ఎందుకంత భయమని, పోలీసులను అడ్డుపెట్టుకుని ఎన్ని రోజులు పాలన సాగిస్తారని ప్రశ్నించారు. ధర్నాలో కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, మాజీ ఎంపీపీలు శ్రీనివాస్‌యాదవ్, సువాళీపంతూనాయక్, రమేశ్‌నాయక్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, జ్యోతయ్య, హరిచంద్‌నాయక్, వెంకటయ్యయాదవ్, బీఆర్ఎస్ మండల, మున్సిపల్ అధ్యక్షులు శంకర్, పత్యానాయక్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వీరయ్య, వెంకటేశ్, నరేశ్, బాబా, శ్రీరాములుతో పాటు బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అన్యాయం..

కడ్తాల్ మండల కేంద్రంలో కస్తూర్బా ఆశ్రమ పాఠశాల కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే నిర్మాణం పూర్తయింది. ప్రారంభోత్సవం చేయాలనుకునేలోపే అసెంబ్లీ ఎన్నికల కోడ్ వచ్చింది. ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కస్తూర్బా పాఠశాలను ప్రారంభోత్సవం చేయకుండా మీనమేశాలు లెక్కించింది. కస్తూర్బాగాంధీ పాఠశాలను ప్రారంభోత్సవం చేసి ఈ విద్యా సంవత్సరం వినియోగంలోకి తీసుకొస్తే పేద విద్యార్థులకు చాల మేలు జరుగుతుందని బీఆర్ఎస్ నాయకులు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చారు. విద్యాసంవత్సరం ప్రారంభమై నెలరోజులు గడిచిన తర్వాత ప్రారంభించడమేమిటని మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్‌తో పాటు మాజీ స్థానిక ప్రజాప్రతినిధులు మండిపడుతున్నారు. రాజకీయ కక్షతోనే పేద విద్యార్థులను అన్యాయం చేశారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. శిలాఫలకాల్లో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల పేర్లు పెట్టాల్సివస్తుందనే దుర్మార్గపు ఆలోచనతో, స్థానిక సంస్థలకు చెందిన ప్రజాప్రతినిధుల పదవీ కాలం ముగిశాక ప్రారంభోత్సవాలు పెట్టుకుని పేద విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటారా అని బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. దశరథ్‌నాయక్ అరెస్ట్‌ను కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, బీఆర్ఎస్ కల్వకుర్తి మండలా ధ్యక్షుడు విజయ్‌గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, వెంకటేశ్ గుప్తా, పత్యానాయక్ తదితరులు ఖండించారు.

కడ్తాల్‌లో మాజీ జడ్పీటీసీ సభ్యుడు దశరథ్‌నాయక్‌ను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

తలకొండపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

‘ఆవిష్కరణ’లకు వేళాయె..

- **సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు ‘ఇంటింటా ఇన్నోవేటర్’**
- **అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేస్తూ 2019 నుంచి ప్రతి ఏటా నిర్వహిస్తున్న తెలంగాణ ప్రభుత్వం**
- **భావి భారత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు మరో వేదిక ‘ఇన్‌స్పైర్ మనక్’**
- **సన్నద్ధం కావాలని పిలుపునిస్తున్న జిల్లా విద్యాశాఖ**

రంగారెడ్డి, జూలై 17(నమస్తే తెలంగాణ) : ‘కొత్త ఆలోచనలకు పదునుపెట్టి.. వాటికి సృజనాత్మకతను జోడించి ఆవిష్కరణలు చేపట్టే వారిని ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఏటా ‘ఇంటింటా ఇన్నోవేటర్’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. ఇందులో అన్నివర్గాల ప్రజలను ప్రభుత్వం భాగస్వామ్యం చేస్తున్నది. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్, కేంద్ర శాస్త్ర సాంకేతిక మండలి సంయుక్తంగా ప్రతి ఏటా ‘ఇన్‌స్పైర్ మనక్’ పోటీలను నిర్వహిస్తున్నది. వినూత్నంగా సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలకు ప్రాధాన్యత కల్పిస్తూ ఆవిష్కణ రూపకర్తలకు ప్రోత్సాహకాలను సైతం అందజేస్తున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తా చాటేందుకు ఈ కార్యక్రమాలకు మంచి అవకాశం కాగా.. పోటీలకు సన్నద్ధం కావాలని జిల్లా విద్యాశాఖ సైతం పిలుపునిస్తున్నది.’

సృజనాత్మకతను చాటే ‘ఇంటింటా ఇన్నోవేషన్’..

ప్రస్తుత పోటీ ప్రపంచంలో సృజనాత్మకతను ప్రోత్సహించడంతోపాటు స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నూతన ఆవిష్కరణలకు అవకాశం కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం ‘ఇంటింటా ఇన్నోవేటర్’ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేస్తూ తెలంగాణ రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్(టీఎస్ఐసీ) ఆధ్వర్యంలో పోటీలను నిర్వహిస్తున్నారు. 2019 నుంచి ఈ పోటీలను నిర్వహిస్తుండగా.. 2024-25 సంవత్సరానికి దరఖాస్తులను టీఎస్ఐసీ ఆహ్వానిస్తున్నది. పాఠశాల, కళాశాల విద్యార్థులతోపాటు రైతులు, మహిళలు, యువకులు, విద్యావేత్తలు.. ఇలా ఎవరైనా సరే.. తమ ప్రాంతాల్లో నెలకొన్న సామాజిక సమస్యలకు పరిష్కారం చూపే ఆవిష్కరణలను రూపొందించి ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. ఆవిష్కరణ రూపకర్తలు తమ ఆవిష్కరణలతో ఆగస్టు 3వ తేదీలోపుగా వాట్సాప్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆవిష్కరణలకు సంబంధించి వంద పదాలతో వ్యాఖ్యలు, రెండు నిమిషాల నిడివి ఉన్న వీడియో, ఆవిష్కరణకు సంబంధించిన నాలుగు చిత్రాలతోపాటు రూపకర్త పేరు, ఫోన్ నంబర్, ప్రస్తుత వృత్తి, పూర్తి చిరునామాను సెల్ నెం.9100678543కి వాట్సాప్‌లో పంపించాలి. ఎంపికైన వాటిని షార్ట్‌లిస్ట్ చేస్తారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయా జిల్లాల్లోనే ప్రాజెక్టులను ప్రదర్శిస్తారు. వీటిల్లో ప్రతి జిల్లా నుంచి ఉత్తమ ఆవిష్కరణలను ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద నగదుతోపాటు ప్రశంసాపత్రాలను అందజేస్తారు.

శాస్త్రీయ నైపుణ్యం వెలికితీసే ‘ఇన్‌స్పైర్ మనక్’..

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లోని శాస్త్రీయ నైపుణ్యం వెలికితీసేందుకు ‘ఇన్‌స్పైర్ మనక్’ వేదికగా నిలుస్తున్నది. భారత ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక విభాగం ఈ కార్యక్రమం ద్వారా సామాజిక సమస్యలకు పరిష్కారం చూపుతూ నూతన ఆవిష్కరణలకు విద్యార్థులు శ్రీకారం చుట్టేలా ప్రోత్సహిస్తున్నది. 6 నుంచి 10వ తరగతి చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆమోదంతో నామినేషన్లను గైడ్ టీచర్ సహకారంతో www.inspireawards-dst.gov.in లో సెప్టెంబర్ 15 వరకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఐడియాను ఆవిష్కరణ రూపంలోకి తెచ్చేందుకు ప్రతి ప్రాజెక్టుకు రూ.10వేల చొప్పున సంబంధిత విద్యార్థి ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తున్నది. జిల్లాస్థాయిలో 10 శాతం ప్రాజెక్టులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి పంపిస్తారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన వాటిలో పది శాతం జాతీయ స్థాయికి పంపిస్తారు. జాతీయ స్థాయిలో ఉత్తమంగా నిలిచే 60 నమూనాలను రాష్ట్రపతి భవన్‌లో ప్రదర్శించే అవకాశం దక్కుతుంది. ఒక్కో జాతీయ ఉత్తమ ప్రదర్శనకు రూ.20వేల నగదు పురస్కారం దక్కుతుంది. రాష్ట్రపతి భవన్‌లో ప్రదర్శన ఇచ్చిన విద్యార్థులకు దేశంలోని ప్రతిష్టాత్మకమైన పరిశోధన కేంద్రాలను సందర్శించే అవకాశాన్ని కల్పిస్తారు.

గతంలో సత్తా చాటిన జిల్లా విద్యార్థులు..

2021-22 విద్యా సంవత్సరంలో ‘ఇన్‌స్పైర్ మనక్’ పోటీల్లో రంగారెడ్డి జిల్లాకు చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. జిల్లాలోని 1,257 పాఠశాలల నుంచి 897 నామినేషన్లు దాఖలుకాగా..115 ప్రదర్శనలు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. అందులో 9 ప్రదర్శనలు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. గత యేడాది కూడా జిల్లావ్యాప్తంగా 1,780 నామినేషన్లు ఫైల్ చేయగా.. జిల్లాస్థాయిలో 115 ప్రదర్శనలు ఉత్తమమైనవిగా ఎంపికయ్యాయి. అందులో జ్యూరీ సభ్యులు 8 ప్రదర్శనలను ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి పంపారు. ఆయా ప్రదర్శనలను రూపొందించిన విద్యార్థులు ప్రశంసాపత్రాలను అందుకున్నారు.

ప్రతి పాఠశాల నుంచి 5 ప్రాజెక్టులు..

పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు తమ వినూత్న ఆలోచనలను ఆవిష్కరించేందుకు ఇన్‌స్పైర్ అవార్డ్స్ చక్కని వేదిక. జిల్లాలోని ప్రతి ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి ఐదు నామినేషన్లు పంపించాలి. ఈ దిశగా పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలి. జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయికి, రాష్ట్రసాయి నుంచి జాతీయ స్థాయికి ఎంపికైతే విద్యార్థుల మంచి భవిష్యత్తుకు పునాది ఏర్పడుతుంది.

సత్తా చాటేందుకు చక్కని అవకాశం..

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి ప్రయోగాలవైపు దృష్టి సారించేలా ప్రోత్సహించేందుకు కేంద్ర శాస్త్ర, సాంకేతిక విభాగం ఇన్‌స్పైర్ మనక్ పోటీలను నిర్వహిస్తున్నది. తెలంగాణ ప్రభుత్వం సైతం ‘ఇంటింటా ఇన్నోవేషన్’ పోటీలను నిర్వహిస్తున్నది. ఈ పోటీల్లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనవచ్చు. ‘ఇన్‌స్పైర్ మనక్’ పోటీలకు మాత్రం పాఠశాల విద్యార్థులే అర్హులు. విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవ